సోమవారం 15-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 394, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## తాటివనంలో ఈత మొక్క నాటిన సీఎం

- గీత కార్మికులకు 'కాటమయ్య రక్ష కిట్లు' పంపిణీ
- హయత్‌నగర్ వరకు మెట్రో రైలు వస్తుంది
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ముందడుగు హైదరాబాద్:

ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన సేఫ్టీ కిట్లను గీత కార్మికులకు 'కాటమయ్య రక్ష కిట్లు' పంపిణీ పథకాన్ని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ ఐఐటీ తయారు చేసిన వీటిని బీసీ కార్పొరేషన్ ద్వారా అందించారు. చెట్లు ఎక్కుతుండగా ప్రమాదాల బారిన పడకుండా ఈ కిట్లు ఉపయోగపడనున్నాయి. లష్కర్‌గూడ తాటివనంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈత మొక్క నాటారు. గీత కార్మికుల సమస్యలను అడిగి



తెలుసుకున్నారు. తాటి వనాల పెంపును ప్రోత్సహించాలని సీఎంను గీత కార్మికులు కోరారు. ఇందు కోసం గ్రామంలో 5 ఎకరాలు కేటాయించాలన్నారు. తాటి వనాలకు వెళ్లేందుకు మోపెడ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ పెరగడం వల్ల తాటి వనాలు తగ్గుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. వన మహోత్సవంలో మిగతా 2లో





## ఎక్స్‌లో మోడీ ఫాలోవర్లు 100 మిలియన్లు

### హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

ముందడుగు జాతీయం:

భారత ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. పార్టీ కార్యక్రమాలు మొదలుకొని విదేశీ పర్యటనల వరకు సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో తనను అనుసరించే వారి విషయంలో ఆయన కొత్త రికార్డు నెలకొల్పారు. 'ఎక్స్'లో ఆయన ఫాలోవర్ల సంఖ్య ఆదివారం 100 మిలియన్ల (10 కోట్లు)ను దాటడం విశేషం. దీనిపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. 'ఎక్స్‌లో ఉండటం, ఈ సామాజిక మాధ్యమం వేదికగా చర్చలు, ప్రజల ఆశీర్వాదాలు, నిర్మాణాత్మక విమర్శలు తదితర వాటికి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాను'' అని పోస్ట్ చేశారు.



పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

మిగతా 2లో



ఆహ్వానం లేకుండా అంబానీ పెళ్లికి వెళ్లారు

మిగతా 2లో



రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు రూ.2 కోట్ల వాచ్

మిగతా 3లో



సహజీవనం చేసేవారికి కొన్ని హక్కులు ఉన్నాయి


మిగతా 4లో

## దేవుడే ప్రాణాపాయం నుంచి కాపాడాడు

- వెంట్రుక వాసిలో మృత్యువు నుంచి బయటపడ్డాను
- అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ముందడుగు అమెరికా:

తనను ప్రాణాపాయం నుంచి దేవుడే రక్షించాడని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. వెంట్రుక వాసిలో మృత్యువు నుంచి బయటపడ్డానని తెలిపారు. అమెరికా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అల్లర్లు చోటు చేసుకోకుండా సంయమనం మిగతా 2లో



## రికవరీ నోటీసులు ఇవ్వొద్దు

- ఆసరా పింఛన్లు దుర్వినియోగమయ్యాయి
- త్వరలో మార్గదర్శకులు విడుదల చేస్తాం
- తెలంగాణ సీఎస్ శాంతి కుమారి వెల్లడి

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతోన్న అనర్హులకు నోటీసులివ్వడంపై తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, త్వరలోనే అర్హులే లబ్ధి పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేస్తామని వెల్లడించింది. మార్గదర్శకాలు ఇచ్చే వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దని మిగతా 2లో



## తాటివనంలో ఈత మొక్క నాటిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా తాటి చెట్ల పెంపకాన్ని పరిశీలిస్తామన్నారు. రోడ్ల పక్కన వీటిని నాటాలనే నిబంధన విధిస్తామని పేర్కొన్నారు. "పేదలకు కూడా కార్పొరేట్ విద్య, వైద్యం అందాలని కాంగ్రెస్ ఆలోచించింది. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు తెచ్చాం. కాంగ్రెస్ చేపట్టిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ వల్ల రంగారెడ్డి జిల్లా భూముల విలువ పెరిగింది. హయత్‌నగర్ వరకు త్వరలోనే మెట్రో రైలు కూడా వస్తుంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాటమయ్య రక్షణ కవచం పనితీరును బుర్రా వెంకటేశం.. సీఎంకు వివరించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

## దేవుడే ప్రాణాపాయం నుంచి కాపాడాడు

(మొదటిపేజీ తరువాయి)

పాటించాలని కోరారు. "ఊహించని పరిణామం నుంచి ఆ దేవుడే నన్ను కాపాడాడు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా అమెరికా ప్రజలంతా ఐక్యం కావాలి" అని సామాజిక మాధ్యమం ద్వారా ఆదివారం ట్రంప్ పిలుపునిచ్చారు. అమెరికా కాలమానం ప్రకారం.. శనివారం సాయంత్రం 6.15 సమయంలో పెన్సిల్వేనియాలో ట్రంప్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఒక్కసారిగా స్టేజిపై పడిపోయారు. చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి.. వేదికై నుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. కాగా, ఈ ఘటనకు పాల్పడిన యువకుడిని భద్రతాబలగాలు హతమార్చాయి. దుండగుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ మద్దతుదారు ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

## రికవరీ నోటీసులు ఇవ్వొద్దు




(మొదటిపేజీ తరువాయి)

సీఎస్ శాంతి కుమారి అధికారులకు సూచించారు. అనర్హులకు లబ్ధి, రికవరీపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉండే పేద కుటుంబాల వారికి అందాల్సిన ఆసరా పింఛన్లు దుర్వినియోగమవుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వోద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ కుటుంబ పింఛను పొందుతున్న వారు సైతం 'ఆసరా' పొందుతున్నట్లు వెల్లడైంది. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో బయటపడిన వారికి ఈ పింఛను రద్దు చేయడంతో పాటు గతంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించింది. అయితే, ఈ వ్యవహారంలో ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసే వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.



## ఆహ్వానం లేకుండా అంబానీ పెళ్లికి వెళ్లారు

### ఏపికి చెందిన ఇద్దరు యువకులు అరెస్టు

ముందడుగు ముంబాయి:

అట్టహాసంగా జరుగుతున్న రిలయన్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికల పెళ్లి వేడుక జరుగుతోంది. దేశ, విదేశాల నుంచి ఎంతోమంది ప్రముఖులు పెళ్లికి హజరయ్యారు. కాని ఈ పెళ్లి కార్యక్రమానికి ఆహ్వానం లేకుండా హాజరైన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వారిద్దరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యూట్యూబర్ వెంకటేశ్ అల్లూరి, వ్యాపారవేత్తగా చెప్పకొంటున్న షఫీ షేక్‌గా గుర్తించారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి.. నోటీసులు ఇచ్చి వదిలేశారు. అయినా, చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ యంత్రాంగమంతా సేవకులే




సమాజంలో ప్రజలు ఎవరి కుల వృత్తి, ఎవరి పని వారు చేసుకుంటున్నారు. వారి ప్రాంతంలో సమస్యలను తీర్చడానికి ఒక వ్యక్తిని నియమించుకున్నారు. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం అన్ని సౌకర్యాలు అతడు సమకూర్చాలి. అందుకు అతడికి పన్నుల రూపంలో జీతాలు చెల్లిస్తున్నారు. కాలక్రమేణా ఆ వ్యక్తి పాలకుడయ్యాడు. పన్నుల రూపంలో జీతాలు చెల్లించే ప్రజలు పేదలవుతున్నారు. ప్రజలకు సేవ చేసే నాయకులను, అధికారులను సర్ అని, అయ్యా అని సంబోధించడం మొదలెట్టారు. కాని నిజానికి ప్రజలే ప్రభువులు, సార్లు, మిగతా పాలకులు, అధికారులు అంతా ప్రజలకు సేవకులే.. అందుకే పాలకులకు, అధికారులకు మీరు సేవకులనే విషయాన్ని మనం ప్రశ్నిస్తూ గుర్తు చేస్తూ ఉండాలి.

- రాజేంద్ర. పల్నాటి,
పౌండర్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

### ఐదు రోజుల పాటు భారీ వర్షాలు: వాతావరణశాఖ



ముందడుగు:

తెలంగాణలో వచ్చే ఐదురోజుల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కోస్తాంధ్ర ప్రదేశ్‌లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన ఆవర్తనం పశ్చిమబెంగాల్ మీదుగా ఏర్పడిన ఆవర్తనంలో కలిసిపోయిందని పేర్కొన్నది. నేటి నుంచి ఐదు రోజుల పాటు ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షా లు కురియవచ్చని పేర్కొన్నది. ఆదివారం హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపైకి వరద చేరడంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నగరంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ముఖ్యంగా మాదాపూర్, హైటెక్ సిటీ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సిబ్బంది వాహనదారులను కోరారు. యూసఫ్‌గూడలోని శ్రీకృష్ణనగర్‌లో ఓ కారు వరదలో కొట్టుకుపోయింది.

ముందడుగు
సోమవారం,
15-7-2024,
హైదరాబాద్.

# కాళ్లు తడవకుండా స్ట్రెచర్‌పై వెళ్లిన ప్రిన్సిపాల్

## మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తీరుపై విమర్శలు

ముందడుగు ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షా లు కురుస్తున్నాయి. దీంతో షాజహాన్‌పూర్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రి కూడా నీట మునిగింది. ఈ నేపథ్యంలో తన కారు వద్దకు నీటిలో నడిచి వెళ్లేందుకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ సంశయించారు. దుస్తులు నీటిలో తడవకుండా ఉండేందుకు స్ట్రెచర్‌పై బయటకు వెళ్లారు. ఒక స్ట్రెచర్‌పై ఆయన కూర్చోగా సిబ్బంది దానిని లాక్కెళ్లారు. రాజేష్ కుమార్ బ్యాగ్, ఇత్తర వస్తువులను కూడా మరో స్ట్రెచర్‌పై తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కర్చీఫ్‌తో తన ముఖాన్ని దాచుకునేందుకు ఆయన ప్రయత్నించారు.



ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఈ విమర్శలను ఆయన ఖండించారు. తన చర్యను సమర్థించుకున్నారు. షాజహాన్‌పూర్‌ను వరదలు ముంచెత్తడంతో మెడికల్ కాలేజీ కూడా జలమయమైందని తెలిపారు. 'నీరు భయంకరంగా పెరిగింది. అంబులెన్స్ ద్వారా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించా. నా కాలికి గాయం ఉంది. మధుమేహం కూడా ఉంది. దాని కారణంగా నేను నడవలేకపోతున్నా. నా వద్ద పని చేసే సిబ్బందితో మాట్లాడా. స్ట్రెచర్‌పై తీసుకెళ్లమని వారు చెప్పారు. మెడికల్ కాలేజీ నుంచి స్ట్రెచర్‌పై బయటకు వచ్చా' అని అన్నారు.

# రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు రూ.2 కోట్ల వాచ్

## సన్నిహితులకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చిన అనంత్ అంబానీ

ముందడుగు ముంబాయి: ప్రపంచంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. తన చిన్ననాటి స్నేహితురాలు రాధిక మర్చంట్‌తో కలిసి అనంత్ శుక్రవారం ఏడడుగులు వేశాడు. ముంబైలో జరిగిన ఈ వేడుకకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. అయితే ఈ వేడుకకు వచ్చిన బాలీవుడ్ నటులతో పాటు పలువురు సినీ రాజకీయ ప్రముఖులకు అనంత్ అంబానీ భారీ బహుమతిని ఇచ్చాడు. తన వెడ్డింగ్‌కు హాజరైన అత్యంత



సన్నిహితులకు అనంత్ అంబానీ ఖరీదైన వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. అడెమార్స్ పిగ్యుట్ బ్రాండ్‌కు చెందిన ఈ వాచీ ధర సుమారు రూ.1.5 కోటి- రూ.2 కోట్ల దాకా ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. ఈ వాచీలు అందుకున్న వారిలో బాలీవుడ్ హీరోలు సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, రణవీర్ సింగ్ తదితరులు ఉన్నారు. తన పెళ్లికి అనంత్ అంబానీ రూ.54 కోట్ల వాచీ ధరించినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి.

# దేశంలో ఉన్నతాధికారులపై కిమ్ వేట

- కొత్త నగర నిర్మాణంలో బాధ్యతారాహిత్యం
- నాసిరకం పనులకు వారే కారణమని ఆగ్రహం

ముందడుగు ఉత్తర కొరియా: తమ దేశంలో నిర్మిస్తున్న కొత్త నగర నిర్మాణంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తాజాగా పలువురు ఉన్నతాధికారులను విధుల నుంచి తొలగించినట్లుగా అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

అంతర్జాతీయ మీడియా వివరాల ప్రకారం కొత్త అపార్ట్‌మెంట్‌లు, హోటళ్లు, స్కీ రిసార్ట్, వాణిజ్య, సాంస్కృతిక, వైద్య సదుపాయాలతో సామ్‌జియోన్‌లో 'సోషలిస్టు ధామం' నిర్మాణం చేపట్టారు. తాజాగా ఈ ప్రాజెక్టును



సందర్శించిన సందర్భంగా కిమ్ మాట్లాడుతూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, ఆర్థికంగా నష్టం వాటిల్లిందని పేర్కొంటూ పలువురు ఉన్నతాధికారులను విధుల నుంచి తొలగిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. రాష్ట్ర నిర్మాణ నియంత్రణ మంత్రిగా నియమించిన రి సన్ చోల్ డిసెంబర్ నుంచి ఒక్కసారి కూడా ఈ పనులను పర్యవేక్షించలేదన్నారు. విచారణకు హాజరు కావాల్సిందిగా ఆయన్ను ఆదేశించారు. ప్రాజెక్ట్ నిర్మాణ తనిఖీ కమిటీ సభ్యులందరినీ కిమ్ సస్పెండ్ చేశారు. దేశీయ పర్యాటకుల కోసం కొత్తగా నిర్మించిన హోటళ్లను సందర్శించిన కిమ్ వాటి నిర్మాణంలో ఆధునికత లేదని, పాత పద్ధతిలో, నాసిరకంగా నిర్మాణాలు చేపడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని పునర్నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

# గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

## అరుణాచలం ఆలయానికి ప్రత్యేక బస్సులు




ముందడుగు హైదరాబాద్: అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణకు వెళ్లాలనుకునే భక్తులకు తెలంగాణ ఆర్టీసీ (టీజీఆర్టీసీ) శుభవార్త చెప్పింది. ప్రత్యేక బస్సులతో ప్యాకేజీని ప్రకటించినట్లు టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో ఆయన పోస్ట్ చేశారు.

ఈనెల 21న గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. 19 నుంచి 22వ తేదీల వరకు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర పట్టణాల నుంచి అందుబాటులో ఉండనున్నాయి. అరుణాచల గిరి ప్రదక్షిణ ప్యాకేజీ బుకింగ్ కోసం ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ https://tsrtconline.inను సందర్శించాలని సజ్జనార్ సూచించారు. ఈ ప్యాకేజీలో కాణిపాక వరసిద్ధి వినాయక స్వామితో పాటు శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముందడుగు
సోమవారం,
15-7-2024,
హైదరాబాద్.

## వైజాగ్ వారియర్స్ కు హైదరాబాద్ లైఫ్‌స్పాన్

# రూ.10 లక్షల నజరానా

### అద్భుత ప్రదర్శనకు డాక్టర్ నరేంద్ర రామ్ ప్రశంసలు




ముందడుగు వైజాగ్:
ఆంధ్రా ప్రీమియర్ లీగ్ 2024లో వైజాగ్ వారియర్స్ ఛాంపియన్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ACA-VDCA ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో వైజాగ్ వారియర్స్ ఉత్తరాంధ్ర లైయన్స్ తో తలపడింది. 13 జూలై 2024న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ 190 పరుగుల సవాలు లక్ష్యాన్ని నిర్దేశించింది. ధీటైన ప్రయత్నం చేసినప్పటికీ, ఉత్తరాంధ్ర లయన్స్ 16.3 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది, వైజాగ్ వారియర్స్ 87 పరుగుల విజయాన్ని అందుకుంది. వైజాగ్ వారియర్స్ సహ-యజమాని మరియు లైఫ్‌స్పాన్ యజమాని అయిన డాక్టర్ నరేంద్ర రామ్, వారి అద్భుతమైన ప్రదర్శనకు ప్రశంసల చిహ్నంగా జట్టుకు రూ. 10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రామ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు మరియు వైజాగ్ వారియర్స్ జట్టు సభ్యులకు, క్రీడా సిబ్బందికి, మీడియా మరియు స్పాన్సర్లకు తన అభినందనలు తెలిపారు. డాక్టర్ నరేంద్ర రామ్ జట్టు వెనుక ఒక ముఖ్యమైన ప్రేరణ శక్తిగా ఉన్నారు.

## రోజూ టీ తాగితే

# క్యాన్సర్ ప్రమాదం

### టీ పదార్థాల్లో విషపూరితమైన శాంపిల్స్





ముందడుగు కర్ణాటక:
టీ చాలా మందికి అదొక వ్యసనంగా మారింది. రోజులో కనీసం రెండు నుంచి మూడు సార్లు టీ తాగేవారు ఉన్నారు. మరికొంత మంది అయితే ఆహారం కంటే ఎక్కువగా టీని తీసుకుంటుంటారు. టీ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆకలి కూడా ఉండదు. ఉద్యోగాల్లో బిజీగా ఉంటూ పని వెంట పడుతూ టీలతో కాలక్షేపం చేస్తుంటారు. అయితే టీని రోజూ తాగడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదాలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**తరచూ టీ ప్రమాదమే**

టీకి క్యాన్సర్ కు మధ్య సంబంధం ఉందని తాజాగా నిపుణులు వెల్లడించారు. తాజాగా కర్ణాటకలోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టీ పదార్థాల్లో విషపూరితమైన శాంపిల్స్ ఉన్నట్లు తెలిపారు. 71 శాతం శాంపిల్స్ లో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. తరచూ టీ తాగడం వల్ల ఆరోగ్యానికి అనేక రకాల హానికరమైన ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**ఉబ్బరం, ఎసిడిటీ**

టీ ప్రాసెసింగ్ చేసే సమయంలో కార్మోసన్ ఫుడ్ కలర్స్, రోడమైన్ బిలను కలుపుతారని వెల్లడించారు. ఇలాంటి టీలను తాగడం వల్ల శరీరం జబ్బుల బారిన పడాల్సి వస్తుంది. ముఖ్యంగా క్యాన్సర్ వంటి కారకాలు శరీరంలోని ప్రవేశించి ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది. అయితే చాలా మంది టీని ఇష్టంగా తాగుతూ ఉంటారు. కానీ టార్ట్రాజైన్ వంటి రసాయనాలు తేయాకు ఉత్పత్తిలో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల దీర్ఘకాలికంగా టీని తాగడం వల్ల తొలుత ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యలు తలెత్తి క్యాన్సర్ వంటి ప్రమాదం వస్తుంది.

# ట్రంప్‌పై కాల్పులు జరిపింది 20 ఏళ్ల కుర్రాడు

### వేదిక నుంచి 130 గజాల దూరం నుంచే కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)
అమెరికాలో ఈ ఏడాది చివర్లో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. రిపబ్లిక్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ వరుసగా మూడోసారి ఈ ఎన్నికల్లో పోటీలో దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తోన్న సమయంలో ఆయనపై ఒక యువకుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆయన కుడి చెవికి బుల్లెట్ తగిలింది.



ఈ ఘటనపై ఎఫ్‌బిఐ పిట్స్‌బర్గ్ ఫీల్డ్ ఆఫీస్ స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్.. మాట్లాడారు. డొనాల్డ్ ట్రంప్‌ను మట్టుబెట్టడానికే ఈ కాల్పులు జరిపినట్లు స్పష్టం చేశారు. ఈ ఉదంతాన్ని ట్రంప్ హత్యకు కుట్రగా అభివర్ణించారు. దీని వెనుక గల కారణాలపై దర్యాప్తు సాగిస్తోన్నట్లు వివరించారు. డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి ప్రయత్నించిన ఆగంతకుడిని థామస్ మాథ్యూ క్రూక్స్ గా గుర్తించారు ఎఫ్‌బిఐ అధికారులు. అతని వయస్సు 20 సంవత్సరాలే. పెన్సిల్వేనియా బేథెల్ పార్క్‌లో నివాసం ఉంటోన్నట్లు నిర్ధారించారు.

ట్రంప్ ప్రసంగిస్తోన్న వేదిక నుంచి సుమారు 130 గజాల దూరంలో ఉన్న ఓ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రూఫ్ టాప్‌పై నుంచి కాల్పులు జరిపాడు. ఒక్కసారి కాదు పలుమార్లు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఓ బుల్లెట్.. ట్రంప్‌ను గాయపరిచింది ఆయన కుడి చెవిని రాసుకుంటూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు.

ఆ వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ కౌంటర్- స్నైపర్ టీమ్ ఎదురు కాల్పులు జరిపింది. స్నైపర్ సిబ్బంది జరిపిన కాల్పుల్లో థామస్ మాథ్యూ క్రూక్స్ అక్కడికక్కడే మరణించాడు. బుల్లెట్లు అతని తలను ఛిద్రం చేశాయి. ఈ కాల్పులు, ఎదురు కాల్పులకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




## స్కై ఫౌండేషన్

# 256వ అన్నదానం

ముందడుగు హైదరాబాద్:
హైదరాబాద్ మహానగరంలో రోజు రోజుకు పెరిగిపోతున్న ఈ అభాగ్యులకు ఒక్కపూట అయినా తీర్చాలనే ప్రయత్నంతో ప్రత్యేక వాహనంలో సంచరిస్తూ ఆహారం అందించి ఆకలి తీర్చే ప్రయత్నం చేసారు. క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం నేటికి 256వ అన్నదాన కార్యక్రమాలు పూర్తి చేసారు. ప్రభుత్వము మానవతాదృక్పదంతో స్పందించి నగరశివారులలో స్థలం కేటాయించి సహకారం అందిస్తే అభాగ్యులందరికి నూతన జీవితాన్నందించే ప్రణాళికను చేపట్టగలము. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు ఇర్ఫాన్, హరీష్, అఖిల్, శుభం, సిద్దార్థ, నరేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు
సోమవారం,
15-7-2024,
హైదరాబాద్.

# టాలీవుడ్‌లో చేయడానికి రెడీ



ఇటీవలే 'సర్ఫిరా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు అక్షయ్‌కుమార్. సుధా కొంగర దర్శకత్వంలో తమిళ సినిమా 'సురారై పోట్రు' ఆధారంగా రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో ఆడుతున్నది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'తెలుగులో 'కన్నప్ప' సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం టాలీవుడ్ మేకర్స్ కొత్తగా ఆలోచిస్తున్నారు. అందుకే వారి సినిమాలు జాతీయస్థాయిలో విజయాలను అందుకుంటున్నాయి.

ఇప్పుడు ఏ భాషలో నటించినా దేశం మొత్తం చూస్తున్నారు. అందుకే తెలుగు మేకర్స్‌తో పనిచేయాలని ఉంది. 'కన్నప్ప' తర్వాత నేను చేయదగ్గ పాత్రలు తెలుగులో దొరికితే తప్పకుండా నటిస్తా.' అని చెప్పుకొచ్చారు అక్షయ్. ఇది టాలీవుడ్ దర్శకులకు, రచయితలకూ ఓ మంచి వార్తే అని చెప్పక తప్పదు. కథ నచ్చితే చిన్న సినిమా అయినా చేసేయడం అక్షయ్ స్టైల్. మిగతా హీరోలకు ఆయన పూర్తి భిన్నం. ఏడాదికి అయిదారు సినిమాలు ఇప్పటికీ చేసేస్తుంటారు. ఇప్పుడు తెలుగులో చేయడానికి రెడీ అన్నారు. ఆయన నిర్ణయం వల్ల తెలుగులో మరిన్ని మంచి కథలు తయారయ్యే అవకాశం లేకపోలేదు.

## కిరణ్ అబ్బవరం పాన్ ఇండియా ప్రాజెక్ట్..

# KA టీజర్ టైం ఫిక్స్




రాజావారు రాణివారు, ఎస్ఆర్ కళ్యాణమండపం సినిమాలతో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు యువ నటుడు కిరణ్ అబ్బవరం (Kiran Abbavaram). ఈ టాలెంటెడ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం క (KA). 1970స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా కథాంశంతో గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సుజిత్-సందీప్ డైరెక్ట్ చేస్తున్నారు. మేకర్స్ లాంచ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. టీజర్‌ను రేపు హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. రేపు ఉదయం 10 గంటల నుంచి ఈవెంట్ మొదలు కానుంది. ఈ చిత్రంలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కిరణ్ అబ్బవరం నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# సహజీవనం చేసేవారికి కొన్ని హక్కులు ఉన్నాయి

- మనదేశంలో చట్టం ఏం చెపుతోంది..
- చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం



ముందడుగు ప్రత్యేకం

ఆడ, మగ ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకోకుండా కలిసి ఉంటే దానిని సహజీవనం అంటారు. పెళ్లి చేసుకోకుండా లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న జంటకు కూడా చట్టపరంగా కొన్ని హక్కులు ఉంటాయి. సహజీవనం చేసేవారు కోరుకున్నట్లు జీవించాలంటే, ప్రస్తుతం వారికి మద్దతు ఇస్తున్న చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం. భారతదేశంలో పౌర హక్కుల పరిరక్షణ చట్టం 1955 వంటి చట్టాలు ప్రతి ఒక్కరి జీవించే హక్కు, స్వేచ్ఛ, భద్రతను కాపాడతాయి. సహజీవనం చేసేవారు ఇలాంటి చట్టాల ప్రకారం వేధింపులు, హింసకు వ్యతిరేకంగా పోరాడవచ్చు, గౌరవంగా జీవించవచ్చు.

### జుడీషియల్, లెజిస్లేటివ్ సపోర్ట్

ఇటీవల కాలంలో శాసన, న్యాయ వ్యవస్థలు పెళ్లి చేసుకోకుండానే కలిసి జీవించేవారి హక్కులను గుర్తించాయి. ఉత్తరాఖండ్‌లో యూనిఫాం సివిల్ కోడ్ ప్రతిపాదన ఈ విషయంలో ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది చట్టంగా ఆమోదం పొందితే, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వీరికి చట్టపరమైన హక్కులు వర్తిస్తాయి.

### గృహ హింస చట్టం

సహజీవనంలో ఉన్న అవివాహిత జంటలకు గృహ హింస చట్టం కింద రక్షణ ఉంటుంది. ఈ చట్టం, రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళలను పరిగణనలోకి తీసుకుంటుంది. వారు గృహ హింసను ఎదుర్కొంటే చట్టపరమైన పరిష్కారాలు పొందే అవకాశం కూడా ఉంది. ఈ రక్షణ మహిళలు న్యాయం పొందేందుకు, వేధింపులకు భయపడకుండా జీవించడానికి సహాయపడుతుంది.

### ఆర్థిక భద్రత

అవివాహిత జంటలకు ఆర్థిక భద్రత అనేది భారతీయ చట్టంలోని మరొక కీలకమైన అంశం. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973లోని సెక్షన్ 125(1)(a) ప్రకారం, లివ్-ఇన్ రిలేషన్స్‌లో భాగస్వాములు, వివాహంలో జీవిత భాగస్వాములకు సమానమైన మెయింటెనెన్స్‌కి అర్హులు. ఈ నిబంధన ఆర్థిక స్థిరత్వం, భాగస్వాముల మధ్య సంబంధాలను ప్రోత్సహిస్తుంది.

### అవివాహిత జంటలకు జన్మించిన పిల్లల హక్కులు

అవివాహిత జంటలకు జన్మించిన పిల్లల లీగల్ స్టేటస్ కూడా ఇటీవల కాలంలో మెరుగుపడింది. పెళ్లి చేసుకున్న వారికి జన్మించిన వారితో పోలిస్తే, లాంగ్ టర్మ్ లివ్-ఇన్ సంబంధాల్లో ఉన్నవారికి పుట్టిన పిల్లలు వివక్షను ఎదుర్కోకూ డదని కోర్టులు తీర్పు ఇచ్చాయి. హిందూ మైనారిటీ, గార్డియన్ షిప్ చట్టం ప్రకారం, ఈ పిల్లలకు హక్కులకు రక్షణ లభిస్తోంది.

### భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?

అవివాహిత జంటలను సమాజంలో పూర్తి స్థాయిలో అంగీకరించకపోయినా, భారతదేశంలో వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు రక్షణ అందిస్తాయి. ఈ హక్కులు వేధింపులు, హింస, ఆర్థిక అస్థిరత నుంచి రక్షణ పొందడంలో సహాయపడతాయి. ఈ చట్టపరమైన నిబంధనలు అవివాహిత జంటలు సామాజిక పక్షపాతం లేకుండా గౌరవంగా జీవించేలా నిర్ధారిస్తాయి. అవివాహిత జంటలు తమ సంబంధాలు నమ్మకంగా, సురక్షితంగా ఉంచుకోవడానికి ఈ హక్కులను అర్థం చేసుకోవడం, అమలు చేయడం చాలా కీలకం. సరైన లీగల్ నాలెడ్జ్ ఉంటే, వారు తమను తాము రక్షించుకోవచ్చు. బలమైన, గౌరవప్రదమైన రిలేషన్స్ నిర్మించుకోవచ్చు.